క్లుప్తంగా

ఆరోగ్యమే ప్రధానం



ఖత్నా చేయించుకున్న బాలలతో నిర్వాహకులు

కడప కల్చరల్: దేశంలో ఈ ఆచారాల వెనుక ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా ఉందని కడప అమీన్‌పీర్ దర్గా ముజావర్ అమీర్ తెలిపారు. అమీన్ ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం దర్గా సమీపంలోని నజ్‌ముల్ అమీన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఉచిత వడుగుల (ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప నగరంతోపాటు సమీప ప్రాంతాల తల్లిదండ్రులు తమ బాలలను ఈ కార్యక్రమానికి తీసుకొచ్చారు. వడుగులు చేయించుకున్న వారికి వస్త్రాలు, మందులు, నెయ్యి, గోధుమపిండి తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200 మందికి పైగా బాలలను పెద్దలు తీసుకొచ్చారు.దర్గా ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్: కడప నియోజకవర్గానికి సమీపంలో పనిచేస్తున్న మండల ఎంపీడీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కడప నగరానికి చెందిన సామాజికవేత్త బి.హరిక్రిష్ణ తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ఒక మండలంలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ ఎంపీడీఓగా (ఫుల్ అడిషనల్ చార్జ్) విధులు నిర్వహించే సమయంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. కర్నూలు జిల్లా ఆడిట్ శాఖ దుర్వినియోగం అయిన నిధులను వడ్డీతో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని నోటీసులు కూడా జారీ చేసిందని తెలిపారు. ఆ ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చిన్నారుల సందడి



నృత్యం చేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు కడప శిల్పారామంలో తమ ఆటపాటలతో సందడి చేశారు. కమలాపురం మండలం చదిపిరాళ్లకు చెందిన చిన్నారులు డ్రమ్ముల విన్యాసం ప్రదర్శించి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. సినీ గీతాలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఎస్.కృష్ణప్రసాద్, మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.

25న పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్ : వైఎస్సార్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న రామాయణ, భారత, భాగవతంలో కొన్ని పాత్రల పుస్తక పరిచయ సభ నిర్వహించనున్నట్లు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక రామకృష్ణవాన ప్రస్థాశ్రమ సేవా సమితి వేదికపై ఆదివారం ఉదయం 9.00 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ది సిటీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ది సిటీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కర్నూలు జిల్లా డివిజన్ ప్రెసిడెంట్ కమలాకర్ తెలిపారు. జిల్లా ప్రెసిడెంట్‌గా యాసిన్‌ఖాన్, సెక్రటరీగా గురుమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా నాగలక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాసులు, విజయభారతి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా సుబ్బారెడ్డి, కోశాధికారిగా ఎల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికైన వారంతా వాణిజ్య పనుల శాఖలో ఉద్యోగులుగా ఉన్నారు.

ముగిసిన యల్లమ్మ జాతర



అమ్మవారి పూజల్లో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు(చెన్నూరు): మండలంలోని చెన్నూరు కేఓఆర్ కాలనీలో వెలసిన యల్లమ్మతల్లి జాతర ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బ్రాహ్మణ వీధిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి పోతులూరు స్వామి ప్రతిమను డప్పు వాయిద్యాలు నడుమ పోతురాజుస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి యల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రవేశాలకు సమయం.. కావాలి ధ్రువపత్రం

- విద్యార్థులు ముందస్తుగా సిద్ధం కావాలి
- చివరిన హైరానా పడకుండా దరఖాస్తు చేసుకోవాలి



కడప తహసీల్దారు కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్: పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. ఉన్నత చదువుల్లో భాగంగా కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులకు పలు ధృవపత్రాలు తప్పనిసరి. వాటిని ముందస్తుగా పొందేందుకు ఇదే మంచి తరుణమని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థుల కోసం సంబంధిత కార్యాలయాల్లో ధ్రువ పత్రాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కడప తహసీల్దారు నారాయణరెడ్డి తెలిపారు.

ఒత్తిడి పెరగకముందే

సాధారణంగా మే, జూన్ నెలల్లో తహసీల్దారు కార్యాలయాల్లోని సిబ్బందిపై ధ్రువపత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. దరఖాస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో వీఆర్వో, ఆర్ఐ పరిశీలన, డిజిటల్ సంతకాల పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ నేపథ్యంలో కార్యాలయాలకు పలుమార్లు తిరగాల్సి రావడం పరిపాటి. కొంతమంది మధ్యవర్తులను ఆశ్రయించడం, అనుకున్న సమయానికి పత్రాలు అందకపోవడం జరుగుతోంది. ముందుగానే మేల్కొంటే ఇబ్బందులు తలెత్తవని అధికారులు సూచిస్తున్నారు. .

ధ్రువపత్రాలు పొందాలంటే

ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు తమ పై తరగతుల ప్రవేశానికి ఆదాయం, కులం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ పత్రాలు తప్పనిసరి. వాటికోసం సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత పత్రాలతో సంబంధిత అర్జీ పూర్తిచేసి అవసరమైన జిరాక్స్ కాపీలను జతచేసి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేయాలి.

ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలపై వీఆర్వో, క్షేత్ర స్థాయిలో, ఆర్ఐ నేరుగా పరిశీలించి అన్నీ పక్కాగా ఉంటే చివరగా తహసీల్దారు లాగిన్‌కు పంపుతారు. ఆయన పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తారు. దీనిపై మొబైల్‌కు వచ్చే మెసేజ్ ద్వారా దరఖాస్తుదారులు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో ధృవపత్రాలు పొందవచ్చు.

ముందే దరఖాస్తు చేసుకోవాలి



పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సుల్లో చేరే విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలు ముందుగా సిద్ధం చేసుకుంటే మంచిది. చివరి సమయంలో హడావుడిగా వచ్చి ఆందోళన చెందకుండా సెలవుల్లోనే కార్యాలయాల్లో సంప్రదిస్తే మంచిది. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన సమయం కంటే ముందుగా వాటిని జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – నారాయణరెడ్డి, తహసీల్దార్, కడప

20 నుంచి పంచముఖ ఆంజనేయస్వామి ఉత్సవం

కడప కల్చరల్: స్థానిక నెహ్రూ నగర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు గడియారం కిరణ్‌కుమార్‌శర్మ, ధర్మకర్త తాళ్లపాక రామసురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 20న మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ధ్వజారోహణం, గణపతిపూజ, 21న ఉదయం 7 గంటల నుంచి నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, హోమాలు ఉంటాయన్నారు. 22న గురువారం హనుమ జయంతి సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి ఆకు పూజలు, మన్యసూక్త, రుద్ర హోమాలు, పూర్ణాహుతి, ధ్వజా అవరోహణం, లక్ష్మి హోమం ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద పంపిణీ, సాయంత్రం 5 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

బాబా మందిరంలో

నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలోగల షిరిడి బాబా మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 22న ఆలయంలో ఉదయం 5 గంటలకు అభిషేకం, 6 గంటలకు అలంకరణ, 6.30 గంటలకు భక్తులకు సర్వదర్శనం, ప్రసాద వితరణ, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటాయన్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి ఉభయదారుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ, వడమాల పూజ, అర్చన, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం



వరుడితో పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడప కార్పొరేషన్: కడప–రాయచోటి రోడ్డులోని కడప కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ రఫీ కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాయచోటి మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడప డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంలున్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ నేత సుభాన్ బాషా, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, జమాల్ వలి, దాసరి శివ, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామి రెడ్డి, చాక్లెట్ గౌస్, షఫీ, ఆరిఫ్, డివిజన్ ఇంచార్జ్ మున్నా తదితరులు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ శాఖలు, విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిరుపేద యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. 2023లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులపై దృష్టి పెట్టి ఉద్యోగాల భర్తీ చేపట్టిందన్నారు. ఆ తర్వాత ఇప్పటిదాకా ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

కడప రూరల్: వేడుకలా మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కడప నగరానికి సమీపంలో నిర్వహిస్తున్న మహానాడు ప్రాంగణ స్థలాన్ని మంత్రులు, ఆ పార్టీ నేతలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహానాడు కడపలోనే నిర్వహించాలనే సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా 145 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27, 28వ తేదీన 23 వేల మంది ప్రతినిధులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 29న భారీ బహిరంగ సభ ఉంటుందని, దాదాపు 5 లక్షల మందికిపైగా ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, అనిత, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు పయ్యావుల కేశవ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుంకులమ్మ తిరునాల



రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఆదివారం ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఈ తిరునాల మహోత్సవం జరిగింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఊరేగింపులో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సీనియర్ కేటగిరి ఎద్దులకు నిర్వహించిన బండ లాగుడు పోటీలను ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 7 జతల ఎద్దు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన కట్టుబడి రోలికి చెందిన ఎద్దు అత్యధికంగా 4808.9 అడుగులు దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దు 4685.10 అడుగులతో రెండో స్థానంలో, నంద్యాల జిల్లా సిరివెళ్లకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దు 4678.6 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంకు చెందిన రామాంజనేయులు ఎద్దు 4644.2 అడుగులతో నాల్గవ స్థానంలో, ఖాజీపేట మండలం పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య ఎద్దు 4271 అడుగులతో 5వ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రామాంజనేయులు ఎద్దు 3450.4 అడుగులతో 6వ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంకు చెందిన బంటుపల్లి రాజశేఖర్ ఎద్దు 3055.4 అడుగులతో చివరి స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు నిర్వాహకులు అందజేశారు.

పనులు నాసిరకం



మారుతీ నగర్‌లో నిర్మించిన సీసీ కాలువలు

కడప కార్పొరేషన్: కడప 20వ డివిజన్‌లోని మారుతీనగర్‌లో పాత ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఎదురుగా సీసీ కాలువలు, సిమెంటు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. టెండర్లు పూర్తయి ఏడాదిన్నర పూర్తయినా పనులు చేయకపోవడంపై ‘సాక్షి’లో వార్తలు ప్రచురితమైన నేపథ్యంలో ఇటీవల పనులు ప్రారంభించారు. ఇక్కడ నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువలు అత్యంత నాసిరకంగా ఉన్నాయని, తగిలితే చాలు కూలిపోయే రీతిలో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సందు రోడ్లు కలిసే చోట కల్వర్టులు నిర్మించడం లేదనే విమర్శలున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బంధువు కావడంతో తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని వారు పేర్కొంటున్నారు. నగరపాలక అధికారులు పనుల నాణ్యతను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేపు జాబ్‌మేళా

నందలూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అన్నమయ్య జిల్లా – ఉపాధి కల్పన వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (ఎస్ఈఈఈడీఏపీ) ఆధ్వర్యంలో మంగళవారం ఆకేపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పేటీఎం, ఎస్‌బీఐ కార్డ్స్, సూపర్ కె, టాటా ఏఐఏ, ఆదర్శ ఆటో వరల్డ్, మారుతి సుజుకి, ఏయు స్మాల్ ఫైనాన్స్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఆసక్తి గల నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఒరిజినల్ జిరాక్స్ కాపీలు, ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 9676736623, 9381695985 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రోత్సహించేందుకే ఈ పోర్టల్

కడప కోటిరెడ్డి సర్కిల్: క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించేందుకే ఈ పోర్టల్ నిర్వహిస్తున్నామని యూనియన్ బ్యాంకు ఆర్వో రంజిత్ తెలిపారు కడప నగరంలోని కెఎస్‌ఆర్‌ఎమ్ గ్రౌండ్లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు అనేక యూనియన్లు సహకారం అందించాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గరుడయ్య, కిరణ్ కుమార్ , వార్షవర్ధన్, అనిల్రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపన

కడప ఎడ్యుకేషన్: కడప సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు.

కడప రాయుడి సన్నిధిలో నిత్యాన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కడప కల్చరల్: దేవుని కడప లక్ష్మీ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన వితరణ చేసేందుకు భక్తులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో తమవంతుగా మొక్కులు చెల్లించి తమ కుటుంబంతోపాటు అన్నదానం చేసేందుకు పలువురు పోటీ పడుతున్నారు. స్వామి సన్నిధిలో ఓ కౌంటర్ ఏర్పాటు చేసి ఆలయన నిర్వాహకులు నిత్యాన్నదానం చేయిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ప్రధాన అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్‌తోపాటు అర్చక బృందం తమ వంతుగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చొరవచూపుతున్నారు. ఉదయం భక్తులు మొక్కులో భాగంగా అల్పాహార కార్యక్రమానికి తమ వంతు భక్తిని చాటుతుండగా, మధ్యాహ్నం ప్రతిరోజూ ఎలాంటి కొరత లేకుండా అన్నదాన ప్రక్రియ కొనసాగుతోంది. భక్తులకు అప్పటికప్పుడు కబురు అందించి అన్నదానానికి లోటు జరగకుండా నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు.

ప్రతి శనివారం ప్రత్యేకం

ప్రతి శనివారం ఆలయంలో మధ్యాహ్నం 11 నుంచి గంటన్నరపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. పలుమార్లు రెండు విడతలుగా అన్నం, చిత్రాన్నం, పెరగన్నం, సాంబారు, పెరుగు, రసం, తాళింపు, పచ్చడి, మజ్జిగతోపాటు ప్రత్యేకంగా స్వీటు అందిస్తున్నారు. టీటీడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్నదానానికి భక్తుల నుంచి విరాళాలు తీసుకుని జాగ్రత్తగా టీటీడీ ప్రధాన కార్యాలయానికి అందజేస్తున్నారు. ఇందులోఎలాంటి లోటుపాట్లు లేకుండా ఇద్దరు, ముగ్గురు పర్యవేక్షణ చేస్తున్నారు. ఉద్యోగం లభించినా, షష్టి పూర్తి, జన్మదినాలు చేసుకున్నవారు పైకం చెల్లించి టీటీడీ ద్వారా అన్న వితరణకు సహకారం అందిస్తున్నారు. రెండుచోట్ల పాత సత్రాలను శుభ్రపరిచి విశాలంగా భక్తుల సౌకర్యం కోసం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నియంత్రణ



ర్యాలీలో డీఎంహెచ్‌ఓ నాగరాజు, తదితరులు

కడప రూరల్: అవగాహనతోనే హెచ్‌ఐవీని నియంత్రించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. హెచ్‌ఐవీ నివారించాలని కోరుతూ స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కొవ్వొత్తులు పట్టుకుని చేపట్టిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేము గుర్తించుకుంటాం.. మేము మాట్లాడుతాం.. మేము నడిపిస్తాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ చట్టం–2017 ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సగిలి రవిబాబు మాట్లాడుతూ ఏటా మే నెల మూడో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహిస్తామన్నారు. ఎయిడ్స్‌తో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వ్యాధితో బాధపడే వారికి మనో ధైర్యం కలిగించడానికి ఈ ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు, శశిభూషణ్‌రెడ్డి, ఉబేదుల్లా, మలేరియా అధికారి మనోరమ, జిల్లా సమన్వయ కర్త డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి



మాజీ ఉప రాష్ట్రపతికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులురెడ్డి, తదితరులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమం కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) బాధ్యులతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బ్రహ్మశ్రీ అవధాని మాజీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు మాడుగుల నాగఫణి శర్మలను ఆయన కలిసి తెలుగు భాషోపాధ్యాయుల సమస్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తెలుగు మాధ్యమం కోసం ఎన్నో పోరాటాలు చేశామని, కూటమి ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని కొనసాగించడంలో గత ప్రభుత్వ మార్గాన్ని అనుసరిస్తోందని తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గారితో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగా గంగాధర్, మద్దిలేటి, జి.వేణుగోపాల్, సహదేవారెడ్డి, మురళి, వెంకటరమణ, మధు, రవిశంకర్, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య తెలిపారు. కడప ఆపస్ కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పభుత్వం ఇటీవల అసంబద్ధంగా జారీ చేసిన 19, 20, 21వ జీవోలు రద్దు చేయాలని, ఇంగ్లీష్ మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:20గా, ఉన్నత పాఠశాలలో 1:30 గా ఉంచాలనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చిన 17 సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోగుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత 30 వారాలుగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉపాధ్యాయ సంఘాల నేతలను సమావేశపరిచి అభిప్రాయాలు తీసుకుని ఒక దానిని అమలు చేయకపోవడం దారుణం అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పోరాటం చేసి విద్యా వ్యవస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంఘం కార్యకర్త వ్యక్తిగత బాధ్యత తీసుకొని వేలాది మంది ఉపాధ్యాయులతో ఈ నెల 21న జరిగే ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సబ్బరాయుడు, జిల్లా ప్రధాకార్యదర్శి కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుల తర్వాత రైతులకు సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంకయ్యకుమార్

కడప అగ్రికల్చర్: ఉన్నత చదువులు పూర్తయిన తర్వాత రైతులకు సేవచేయడంతోపాటు, తమ తల్లిదండ్రులకు మంచి చేయాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్యకుమార్ అన్నారు. కడప నగర శివారులోని తాడిగోట్ల గ్రామంలో తిరుపతి వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేపట్టిన జాతీయ సేవా పథకం కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇన్‌ఛార్జి డాక్టర్ పాండురంగ(కీటక విభాగ శాస్త్రవేత్త) మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిపై సర్వే, మొక్కలు నాటడం, పరిసరాలు శుభ్రం చేయడం, ఉచిత వైద్య శిబిరం, కార్యక్రమాలు నిర్వహించాని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగు పాటు.. తస్మాత్ జాగ్రత్త..!



పిడుగుపడి మృతి చెందిన సుబ్రహ్మణ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు తార స్థాయికి చేరడంతోపాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతూ పలుచోట్ల పిడుగులు పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మనుషులతోపాటు మూగ జీవులు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడుతున్నారు. పొలాల్లో పనులు చేసుకునే రైతులు, పశువుల కాపర్లు ఎక్కువగా పిడుగు పాటు బారిన పడుతున్నారు. సమీప ప్రాంతంలో ఇళ్లకు సమీపంలో పిడుగులు పడుతుండడంతో గృహోపకరణాలు కాలిపోయి తీవ్ర నష్టం జరుగుతోంది. పిడుగుపాటు ప్రమాదాల నుంచి తప్పించుకొనేందుకు నిపుణులు కింది సూచనలు చేస్తున్నారు.

ఇలా చేయకూడదు

- వర్షం కురిసేటపుడు ఎవరూ చెట్టు కింద ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే పొలాల్లో ఉండరాదు.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లు, అంతకన్నా తక్కువ సమయంలో ఉరుము వినిపిస్తే పది కిలోమీటర్ల దూరంలో పిడుగు పడే అవకాశం ఉంది.
- మెరుపు కనబడిన తర్వాత 30 నిమిషాలపాటు బయటికి వెళ్లే ప్రయత్నం చేయరాదు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతిలో సెల్ ఫోన్లు లేకుండా చూసుకోవాలి. ఒకవేళ సెల్‌ఫోన్ ఉంటే స్విచ్ఛాఫ్ చేయాలి. లేకపోతే రేడియస్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్‌తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండరాదు. చెప్పులు లేకుండా బయటికి వెళ్లరాదు.
- గుండె వ్యాధులు ఉన్న వారు మెరుపులు, ఉరుములతో భయాందోళనకు గురవుతారు కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రథమ చికిత్స చేయాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని పొడి ప్రదేశంలో చిన్నగా పడుకోబెట్టాలి. శరీరంపై తడి బట్టలు తీసివేయాలి. తలను ఒక ప్రక్కకు తిప్పి రెండు కాళ్లను అడుగు పైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించాలి. – డాక్టర్ రమణయ్య, రిమ్స్ వైద్యులు, కడప